క్లుప్తంగా

హార్టికల్చర్ ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్ల మంజూరు



ప్రాసెసింగ్ సెంటర్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారులు

కుందుర్పి: కళ్యాణదుర్గం, కుందుర్పి మండలాలకు హార్టికల్చర్ కింద ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్లు మంజూరయినట్లు డీహెచ్ఓ నరసింహరావు తెలిపారు. కుందుర్పి మండలం బండమీదపల్లిలో, కళ్యాణదుర్గం మండలం ఎం. వెంకంటపల్లిలో ఈసెంటర్లు మంజూరయ్యాయి. ఒక్కో సెంటర్‌కు రూ.5కోట్లు వంతున మంజూరైనట్లు వారు తెలిపారు. ఆయా మండలాల్లో డీహెచ్ఓతో పాటు ఆయా మండలాల హార్టికల్చర్ అధికారులు ఎఫ్‌పీసీల పరిధిలోని నిర్మాణాలను బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఓ రత్నకుమార్, ఏఎఫ్ సంస్థ నుంచి శంకర్‌నాయక్, రమేష్, వెంకటేష్, కళ్యాణదుర్గం, కంబదూరు హార్టికల్చర్ అధికారులు కృష్ణతేజ, గౌషియా పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజన' నిర్వాహకులకు శిక్షణ



శెట్టూరులో మెనూ ప్రకారం వండి ప్రదర్శనకు ఉంచిన దృశ్యం

శెట్టూరు: స్థానిక ఎమ్మార్సీలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. బుధవారం ఎంఈఓలు శ్రీధర్, వాణీదేవి ఆధ్వర్యంలో జిల్లా నుంచి హాజరైన శిక్షకురాలు సరస్వతి శిక్షణ ఇచ్చారు. రోజువారి మెనూ ప్రకారం వంట ఎలా చేయాలి..? రుచికరంగా, పోషకాలు అందేలా ఎలా వండాలి? తదితర విషయాలు తెలియజేశారు. వంట గదిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వంట సమయంలో ఉండాల్సిన డ్రస్సులు, పాత్రల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 50 పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులు, వారి సహాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికడదాం



సమావేశంలో మాట్లాడుతున్న పశువైద్యశాఖ డీడీ వెంకటేశులు

శెట్టూరు: పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులను అరికడదామని పశుసంవర్ధకశాఖ డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశులు అన్నారు. బుధవారం స్థానిక పశువైద్యశాలలో శెట్టూరు, కుందుర్పి మండల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధులు చిటికి వ్యాధి, జబ్బువాపు వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. వ్యాధులు నివారణ, నిర్దేశించిన లక్ష్యాలు వాటి ప్రగతి నివేదికలపై తెలియజేశారు. పాడి రైతులకు ఆర్బీకేల ద్వారా గడ్డి విత్తనాలు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు నాగలింగేశ్వర రెడ్డి, ప్రసాద్, శర్మ, ఏహెచ్ఏలు పాల్గన్నారు.

బాధితుడికి పరామర్శ



వైఎస్సార్‌సీపీ నాయకుడిని పరామర్శిస్తున్న రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని పాలవాయి గ్రామ సర్పంచ్ రత్నమ్మ భర్త గోపాల్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య పాలవాయి గ్రామానికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. రంగయ్య వెంట రాష్ట్ర నాయకులు తిప్పేస్వామి, నారాయణపురం వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అరటితోట దగ్ధం



మంటల్లో కాలిపోయిన అరటి తోటను చూపుతున్న రైతు గురుస్వామి

బెళుగుప్ప: మండల పరిధిలోని అంకంపల్లికి చెందిన కౌలు రైతు గురుస్వామి సాగు చేసిన అరటి తోట విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం కాలిపోయింది. బాధిత రైతు గురుస్వామి తెలిపిన మేరకు.. ఏడు ఎకరాల్లో యాలక్కి రకం అరటి పంట సాగు చేస్తున్నాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఏడు ఎకరాల్లోని డ్రిప్ పైపులు కూడా కాలిపోయాయి. సుమారు రూ.13 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

చదువు కొనలేరు



- ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రారంభమైన అడ్మిషన్లు
- తడిసిమోపెడవుతున్న ఫీజులు
- ఎల్‌కేజీకి రూ.15 వేలు..పదోతరగతికి రూ.50 వేలు

పాఠశాలల్లో ఉండాల్సిన నిబంధనలు ఇలా..

- విద్యార్థులకు సరిపడా గదులు వసతులతో కూడా ఉండాలి. భవన నిర్మాణ నాణ్యత ధ్రువీకరణ పత్రం ఉండాలి. విద్యార్థుల మానసిక ఎదుగుదల కోసం ఆట స్థలం, లైబ్రరీ, ప్రహరీ, అగ్నిమాపకశాఖ జారీ చేసిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఉండాలి.
- తాగునీటి వసతి, ప్రథమ చికిత్స సౌకర్యం, కంప్యూటర్ గది, మూత్రశాలలు, మరుగుదొడ్లు కచ్చితంగా ఏర్పాటు చేసి ఉండాలి. విద్యాహక్కు చట్టం ప్రకారం బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన ఉపాధ్యాయులతో బోధన చేయించాలి.
- పిల్లలు రోడ్డు దాటడానికి సౌకర్యం కల్పించాలి. ఫీజుల వివరాలు స్పష్టంగా నోటీసు బోర్డుపై అతికించాలి. ప్రభుత్వం పుస్తకాలతోనే బోధన సాగించాలి.
- ఒక గదిలో 40 మంది విద్యార్థులు దాటితే మరో సెక్షన్ కోసం అనుమతి తీసుకోవాలి. ప్రీప్రైమరీ కోసం అనుమతి తీసుకోవడం, తదితర వసతులు ఉండాలి.

రాయదుర్గం: 'మేం చదువు కొనలేక కష్టాలు పడుతున్నాం..మా బిడ్డలనైనా పట్నంలో ఉండే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తే, ఏ ప్రభుత్వ ఉద్యోగమో.. ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగమో సంపాదించుకుంటారు.. వాళ్ల జీవితాలు బాగుంటాయి..'అని చాలా మంది తల్లిదండ్రులు ఆశ పడుతుంటారు. అయితే వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. నోట్ పుస్తకాల నుంచి పెన్ను, పెన్సిల్ వరకు వారి వద్దే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నాయి. ఒక విద్యార్థిని చదివించాలంటే అన్ని ఫీజులు కలిపి తడిసిమోపెడవుతున్నాయి. ఇంతింత ఫీజులు చెల్లించి ఇంకేం చదివిస్తాం అని నిట్టూరుస్తున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని సుమారు 250 వరకు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. వీటి పరిధిలోని 2024–25 విద్యా అకాడమీకి ఏడాదికి తరగతుల వారీగా అడ్మిషన్లు ప్రారంభించారు. పాఠశాలలు పునఃప్రారంభించిన తర్వాత ప్రవేశాలు చేపట్టాల్సి ఉంది. అయితే దీనికి విరుద్ధంగా కొందరు యజమానులు వ్యవహరిస్తున్నారు.

ఏటేటా పెరుగుతున్న ఫీజులు..

ఎల్‌కేజీ విద్యార్థులకు సగటున రూ.15 వేలు, పదో తరగతి విద్యార్థులకు రూ.40 వేల నుంచి రూ.50 వేలు ఫీజులు వసూలు చేస్తున్నారు. వీటికి తోడు పాఠశాలల్లోనే పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, టై, బెల్టు కొనుగోలు చేయాలనే నిబంధన పెడుతున్నారు. బహిరంగ మార్కెట్లో అవే వస్తువులు 10 నుంచి 15 శాతం తక్కువ ధరకు లభిస్తున్నాయి. అక్కడ కొనుగోలు చేద్దామన్నా, అనేక ఆంక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారమైనా సరే భరిస్తున్నారు. రవాణాకు అధనంగా వసూలు చేస్తూ మరింత భారం నెత్తినేస్తున్నారు.

సౌకర్యాలు అంతంత మాత్రమే..

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో తరగతి గదుల్లో వెలుతురు, స్వచ్ఛమైన గాలితో పాటు శుభ్రత ఉండాలి. ఇలాంటివి చాలా తక్కువ కనిపిస్తాయి. వెలుతురు లేకపోగా, ఫ్యాన్లు కూడా సక్రమంగా తిరగని పరిస్థితి. మెజార్టీ పాఠశాలల్లో పిల్లలు ఆడుకోవాడానికి మైదానాలు లేవు. స్టడీ అవర్స్ పేరుతో ఉదయం 7 నుంచి సాయంత్రం 7 వరకు గదుల్లోనే బంధిస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో మానసిక వికాసం తగ్గిపోతుందని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వ బడుల్లో అధునాతన సౌకర్యాలు :

వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక విద్యాసంస్కరణలు ప్రవేశపెట్టారు. 59 నెలల పాలనా కాలంలో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారిపోయాయి. నాడు-నేడుతో కార్పొరేట్‌కు ధీటుగా రూపుదిద్దుకున్నాయి. బైలింగ్వేల్ పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, విద్యా కానుక ద్వారా షూ, టై, బ్యాగు అన్నీ ఉచితంగా అందిస్తున్నారు. ప్రతి విద్యార్థికీ మూడు జతల యూనిఫాం, స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటయ్యాయి. మెనూ అమలు చేస్తూ, రోజుకో రకం నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో చేర్పిస్తే అన్నీ ఉచితమే.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

బడులు పునఃప్రారంభించిన తర్వాతే అడ్మిషన్లు చేసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు చేపడతాం. ముఖ్యంగా అధిక ఫీజులు వసూలు చేస్తే, పాఠశాలల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలకు ఆదేశిస్తాం. ప్రతి పాఠశాలలోనూ ఫీజులు వసూలుపై బోర్డు ప్రదర్శించాలి. పాఠశాలల్లో తనిఖీలు చేపట్టి, ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేస్తాం. వసతులన్నీ ఉండేలా యజమానులు చూసుకోవాలి.

– నాగమణి, ఎంఈఓ, రాయదుర్గం

ఆలయ భూముల వేలంలో పెరిగిన ఆదాయం



బహిరంగ వేలం వేస్తున్న అధికారులు

వజ్రకరూరు: స్థానిక జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన కౌలుకు ఆలయ భూముల వేలంపాటలో ఆదాయం పెరిగింది. జనార్దన వేంకటేశ్వరస్వామి, జనార్దన ఆంజనేయస్వామి, చోప్పరం ఆంజనేయస్వామి, చెన్నకేశవ ఆంజనేయ స్వామి దేవస్థానాల భూములను భూములను 2024–25 సంవత్సరంలో ఏడాది కాలానికి కౌలుకు ఇవ్వడానికి బహిరంగ వేలం వేశారు. అనంతరం ఆలయ ఈఓ అంగడాల కృష్ణయ్య మాట్లాడుతూ మొత్తం 98.3 ఎకరాల భూమికి వేలం వేసినట్లు తెలిపారు. రూ.8,96,000 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గతేడాది కంటే రూ.67,500 అదనంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి రమేష్‌బాబు, ఆలయ ఈఓ అంగడాల కృష్ణయ్య, క్లర్క్ లాలేష్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు విధివిధానాలు పాటించాలి

- ఈఆర్ఓ కరుణకుమారి



సూచనలిస్తున్న ఈఆర్ఓ కరుణకుమారి

రాయదుర్గం రూరల్: జిల్లా కేంద్రంలో జరిగే ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున కౌంటింగ్ ఏజెంట్లుగా నియమింపబడిన వారు ఎన్నికల కమిషన్ విధివిధానాలు తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల బరిలో ఉన్న పార్టీ ప్రతినిధులకు ఈఆర్ఓ కరుణకుమారి సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ఆయా పార్టీల నాయకులు కౌంటింగ్ ఏజెంట్లను నియమయమించాలని, నిర్దేశించిన వేళకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని, కౌంటింగ్ సమయంలో పాటించాల్సిన విధివిధానాలు ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఐడీ కార్డు కలిగి ఉండాలని తెలిపారు. ఉదయం 7 గంటలకు స్ట్రాంగ్ రూం తెరువబడుతుందని, 22 రౌండ్లలో లెక్కింపు ఉంటుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిట్టిబాబు, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్ , బీఎస్పీ, స్వతంత్ర అభ్యర్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహారుద్ర యాగం



అలంకరణలో మల్లికార్జున స్వామి



ఆలయంలో ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్న వేద పండితులు

ఉరవకొండ: విడపనకల్లు మండలం ఉండబండలో వెలసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఈనెల 23 నుంచి లోక కల్యాణార్థం ప్రారంభమైన పూజలు, హోమాలు బుధవారం ముగిశాయి. ఉదయం స్వామి మూలవిరాట్‌కు అభిషేకం, మహా మంగళహారతి, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి, నవగ్రహ, మహారుద్రయాగం నిర్వహించారు. అనంతరం వేదమూర్తి డాక్టర్ జె.పంపాపతి శాస్త్రి అమృతహస్తాలతో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు.

ముగిసిన అక్క దేవతల జాతర



కూడేరు: అక్కమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

కూడేరు: మండలంలోని పి.నారాయణపురంలో అక్కమ్మ దేవతల జాతర బుధవారం వసంతోత్సవ కార్యక్రమంతో ముసిగింది. జాతరకు గ్రామస్తులు బంధుమిత్రులను ఆహ్వానించడంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తొలుత ఆలయ అర్చకులు అక్కమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత వెండి ఆభరణాలు, పుష్పాలతో విశేషంగా అలకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తి శ్రద్ధలతో ప్రజలు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు. అక్కమ్మ దేవతల నామస్మరణ మార్మోగింది. పలువురు గ్రామస్తులు పన్నేరపు బండ్లు ఆలయం చుట్టూ తిప్పారు. భక్తులకు అన్నదానం చేశారు.

తిమ్మప్పస్వామిని దర్శించుకున్న రంగయ్య

కంబదూరు: మండలంలోని ములకనూరులో జరిగిన తిమ్మప్ప జాతరలో ఎంపీ, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య బుధవారం పాల్గొన్నారు. ముందుగా ఎంపీ రంగయ్య తిమ్మప్పస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, ఎంపీపీ తిమ్మరాజమ్మ ఇంట్లో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థితోపాటు ఆ పార్టీ నేత ఉమామహేశ్వరనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బండిని ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ప్రమాదంలో పూర్తిగా ధ్వంసం అయిన ఎద్దుల బండి

బెళుగుప్ప: మండల పరిధిలోని వెంకటాద్రిపల్లి గ్రామం వద్ద పొలం పనులకు వెళ్తున్న ఎడ్ల బండిని అనంతపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక వైపు నుంచి ఢీకొనింది. బుధవారం ఉదయం రైతు మహేష్ ఎడ్ల బండిపైన వ్యవసాయ పనులకు వెళ్తున్నాడు. వెనుకవైపునుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనింది. దీంతో ఎడ్లబండి పూర్తిగా ధ్వంసమైంది. వ్యవసాయ కూలీ ముత్యాలు, ఒక ఎద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ముత్యాలును చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ అచీవర్స్‌డే




ఉద్యోగ నియామక పత్రాన్ని అందిస్తున్న డీఈఈ సరస్వతి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణం సమీపంలోని బోరంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ అచీవర్స్‌డే బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈఈ సరస్వతి (పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్) హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ కుమార్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో 91 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారికి డీఈఈ సరస్వతి చేతుల మీదగా ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ సచిన్, కళాశాల సిబ్బంది, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

బొమ్మనహాళ్: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండొచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారులు గీతాభార్గవి, శ్రీలక్ష్మీ తెలిపారు. బుధవారం మండలంలోని ఉద్దేహాళ్, నేమకల్లు, గోనేహాళ్ గ్రామాల్లో మలేరియా, డెంగీ, చికున్ గున్యా లక్షణాలు, తీసుకోవాల్సిన చర్యలపై ర్యాలీలో అవగాహన కల్పించారు. వైద్యులు మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్ గున్యా లాంటివి వస్తాయన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పరమేశ్వర, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, రమణ, నాగేంద్ర, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తే లైసెన్సు రద్దు



విత్తన ప్యాకెట్‌పై కంపెనీ వివరాలను పరిశీలిస్తున్న ఏడీఏ లక్ష్మానాయక్

రాయదుర్గం రూరల్: రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు నాణ్యమైనవిగా ఉండాలని, నకిలీవి అంటగట్టి రైతులను మోసం చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామని ఏడీఏ లక్ష్మానాయక్ ఫర్టిలైజర్స్ దుకాణ యజమానులను హెచ్చరించారు. బుధవారం ఆయన పట్టణంలోని పలు షాపులను ఏఓ మహేంద్రతో కలిసి తనిఖీలు చేశారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసినప్పుడు చిత్తు కాగితాల్లో రాసి ఇవ్వకుండా ఒరిజనల్ బిల్లులు ఇవ్వాలని సూచించారు. విత్తనాలకు సోర్స్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని, స్టాకు రిజిష్టర్ ప్రతి రోజూ అప్డేట్ చేయాలని, ధరల పట్టిక తప్పని సరిగా షాపు వద్ద ప్రదర్శించాలన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి



తీటలకల్లులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బ్రహ్మసముద్రం : మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని సీఐ హరినాథ్ తెలిపారు. బుధవారం మండలంలోని తీటకల్లులో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల నాయకులను ఇళ్లు, పాత కేసుల్లో నిందితులుగా ఉన్న వారి గడ్డివాముల్లో సోదా చేశారు. గ్రామంలో పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం పోలీసులు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అములో ఉన్నందున ఎవరైనా ప్రజలకు ఇబ్బందులకు గురిచేసినా, పాతకక్షలతో గొడవలకు పాల్పడినా సహించేది లేదన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరు ఎలాంటి అల్లర్లకు పాల్పడకూడదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పరుశు రాముడు, కుందుర్పి ఎస్ఐ వెంకటస్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత రోగ నియంత్రణ కరపత్రాల విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: పెన్నహోబిలంలో జాతీయ కీటక జనిత రోగ నియంత్రణ కరపత్రాలను అర్బన్ సీఐ సురేష్‌బాబు, ఆలయ ఈఓ విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. సీఐ మాట్లాడుతూ విషజ్వరాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కౌకుంట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనికేత్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ భక్తుల కోదండరామిరెడ్డి మాట్లాడారు.

పౌష్టికాహారం అందించాలి



వజ్రకరూరులో మాట్లాడుతున్న మండల విద్యాశాఖ అధికారులు

వజ్రకరూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషక విలువలున్న ఆహారాన్ని అందించాలని మండల విద్యాధికారులు ఎర్రిస్వామి,తిమ్మప్ప తెలిపారు. బుధవారం స్థానిక కేవీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానమంత్రి పోషణ అభియాన్ (మధ్యాహ్న భోజన పథకం) పై ఏజెన్సీ నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ రానున్న విద్యాసంవత్సరంలో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. రోజూ క్రమం తప్పకుండా పాఠశాల మెనూను పక్కాగా అమలు చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు వంటకాలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ రంగమ్మ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ లోకనాథ్, సీఎంఆర్‌టీలు మహమ్మద్ రఫీ, ఓబుళపతి, శశికళ, ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

వజ్రకరూరు: మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జరుట్ల రాంపురానికి చెందిన ఎగ్గిడి రమేష్‌బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ నరేష్ తెలిపిన మేరకు.. ఎగ్గిడి రమేష్‌బాబు మండల కేంద్రం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గంమధ్యలో ట్రాక్టర్ ఢీకొనింది. ఈ ప్రమాదంలో రమేష్‌బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతన్ని మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వీఆర్ఏ మృతి

బ్రహ్మసముద్రం : మండలం కేంద్రంలో వీఆర్ఏ తలారి గంగమ్మ (63) అనారోగ్యంతో మృతిచెందింది. బుధవారం గంగమ్మ మృతదేహానికి తహసీల్దార్ ఈశ్వరయ్య నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగిరెడ్డి , వీఆర్వో వేణు , లాలుస్వామి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

కళ్యాణదుర్గం: మండలంలోని పీటీఆర్ పల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శేషు (25) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బెంగుళూరు, అనంతపురం తదితర ప్రాంతాల్లో చికిత్స చేయించుకున్నాడు. ఉదయం అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ తలారి రంగయ్య శేషు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు



శెట్టూరులో మాట్లాడుతున్న ఎంఈఓ-2 వాణిదేవి

శెట్టూరు: మండల కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తిస్తున్నారు. బుధవారం శెట్టూరులో సర్వే చేశారు. ఎంఈఓ-2 వాణీదేవి ఆధ్వర్యంలో మండలంలో 26 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. వీరు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం నాలుగు రకాల అలివెన్స్‌లు అందిస్తుందన్నారు. ఈ విషయాలపై ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులను అరికట్టండి

కళ్యాణదుర్గం రూరల్: సీజనల్ వ్యాధులను అరికట్టాలని డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేష్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శెట్టూరు, కుందిర్పి మండలాల పశుసంవర్ధక శాఖ అధికారులకు (ఏహెచ్ఏ) సమీక్ష నిర్వహించారు. నూతనంగా నియమించడిన 21 మంది పశు వైద్య సహాయకులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం డీడీ వెంకటేష్ సిబ్బందికి సిజనల్ వాధ్యులపై అవగాహన కల్పించారు.

సబ్సిడీ విత్తన వేరుశనగ పరిశీలన

కూడేరు: స్థానిక రైతు భరోసా కేంద్రానికి సరఫరా అయిన విత్తన వేరుశనగను ఏఓ విజయ్‌కుమార్ పరిశీలించారు. మండలంలోని 12 రైతు భరోసా కేంద్రాలకు 1,900 క్వింటాళ్ల విత్తన వేరుశనగ సరఫరా అయ్యిందన్నారు. విత్తన వేరుశనగ కోసం 1,400 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 1,300 క్వింటాళ్ల విత్తన కాయలను రైతులకు వంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు. మండలానికి 2,500 క్వింటాళ్ల కేటాయింపు చేశారు. విత్తన అవసరాన్ని బట్టి మరో 700 క్వింటాళ్ల వరకు విత్తనకాయలు సరఫరా అయ్యే అవకాశముందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వజ్రకరూరు: మండలంలోని చాబాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈషెక్షావలి ఓ ప్రకటనలో తెలిపారు. 132 ఈహెచ్‌టీ గుంతకల్లు విద్యుత్ ఉప కేంద్రంలో ద్వితీయ లైన్ లాగుతున్నట్లు తెలిపారు. చాబాల విద్యుత్ సబ్‌స్టే షన్ పరిధిలోని చాబాల, ధర్మపురి, గడేహోతూరు తదితర గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల, గూళ్యపాళ్యం, కమలపాడు, వజ్రకరూరు పరిసర ప్రాంతాల్లో ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం తనిఖీలు చేశారు. ఉరవకొండ- గుంతకల్లు ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీలు చేసి, రికార్డులు పరిశీలించారు.